మద్యం విక్రయాలతో ఖజానా కళకళ

● కలిసొచ్చిన కొత్త ఏడాది.. ఒకేరోజు రూ.193 కోట్ల వ్యాపారం



బెంగళూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కొత్త ఏడాదిని స్వాగతించేందుకు ప్రజలు చూపిన ఉత్సాహం రాష్ట్ర ఖజానాకు భారీగానే కలిసొచ్చింది. ఏడాది చివరిరోజు ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా మద్యం విక్రయాలతో ఖజానాకు రూ.193 కోట్ల మేర ఆదాయం వచ్చింది. రోజూ అబ్కారీశాఖకు సుమారు రూ.90 కోట్ల ఆదాయం వస్తుంది. కొత్త ఏడాది సంబరాలు చేసుకునేందుకు యువతీ యువకులే కాకుండా అన్నివర్గాల వారు ప్రత్యేకంగా పార్టీ చేసుకున్నారు. ఈ ప్రభావంతో రూ.193 కోట్ల వ్యాపారం జరిగినట్టు అబ్కారీశాఖ ప్రకటించింది. డిసెంబరు 23 నుంచి 31వరకు చివరి వారం రూ.1072 కోట్ల ఆదాయం వచ్చింది. 2022తో పోలిస్తే రూ.292 కోట్ల మేర అదనపు ఆదాయం వచ్చింది. డిసెంబరులోనే రూ.3వేల కోట్ల వ్యాపారాలు సాగాయి. గత ఏడాదితో పోలిస్తే బీరు వ్యాపారం 15 శాతం పెరిగిందని అబ్కారీశాఖ ప్రకటించింది.

రైతుల కన్నీరు

తుడుస్తాం

● ముఖ్యమంత్రి సిద్దరామయ్య ● సీఎంకు పలువురి నూతన సంవత్సర శుభాకాంక్షలు



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి రజనీశ్ గోయెల్

బెంగళూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పంటలు నష్టపోయిన రైతులను పూర్తిగా ఆదుకోలేకపోయినా కొంతమేరకైనా కన్నీళ్ల తుడిచేందుకు ప్రభుత్వం శతవిధాలా ప్రయత్నిస్తోందని ముఖ్యమంత్రి సిద్దరామయ్య పేర్కొన్నారు. రాష్ట్రంలో 60 శాతం మందికిపైగా ప్రజలు వ్యవసాయంపై ఆధారపడ్డారని, కరువు కారణంగా పలుచోట్ల రైతులు గతంలో కనీవినీ ఎరుగని రీతిలో తీవ్ర ఇబ్బందుల పాలయ్యారని తెలిపారు. ముఖ్యమంత్రికి ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి డాక్టర్ రజనీశ్ గోయెల్ సహా పలువురు మంత్రులు సోమవారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రముఖుల రాకతో బెంగళూరులోని సీఎం నివాసం ఉదయం నుంచే కోలాహలంగా మారింది. ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛాలు అందజేసిన అనంతరం హోంశాఖ మంత్రి డాక్టర్ జి.పరమేశ్వర్ మీడియాతో మాట్లాడారు. రాజధాని బెంగళూరు సహా రాష్ట్ర వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు శాంతియుతంగా ప్రశాంతంగా జరిగాయన్నారు. ఇందుకుగాను పోలీసులకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. సీఎం సిద్దరామయ్య ప్రత్యేకంగా మాట్లాడుతూ నూతన సంవత్సరంలోనైనా కేంద్రం, రాష్ట్రంలోని రైతాంగాన్ని ఆదుకునేందుకు విరివిగా గ్రాంట్లను విడుదల చేస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 48 లక్షల హెక్టార్లలో రూ.35వేల కోట్లకు పైగా పంట నష్టం సంభవించిందన్నారు. రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలకు గ్యారెంటీల పేరిట సంక్షేమాలు అందచేస్తున్నామని, అయినా పదే పదే బీజేపీ మైనారిటీలపై ఏదో ఒక రూపంలో తన అక్కసు వెళ్లబోసుకుంటూనే ఉందన్నారు. కరువు జిల్లాల్లో మంత్రులు పర్యటించడం లేదన్న ప్రతిపక్షాల ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. తానే స్వయంగా అనేక జిల్లాల్లో పర్యటించానని తెలిపారు.

4న ఢిల్లీ వెళ్తున్నా...

కాంగ్రెస్ అధిష్టానం పిలుపు మేరకు ఈనెల 4న ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో కలసి ఢిల్లీ వెళ్తున్నామని సీఎం సిద్దరామయ్య తెలిపారు. ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగే కీలక సమావేశంలో రాష్ట్ర ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలా, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ తదితరులు పాల్గొంటారన్నారు. మంత్రులను లోక్‌సభ ఎన్నికల బరిలోకి దించే అంశంపై తనకు ఎలాంటి సమాచారం లేదన్నారు. మొత్తం 28 నియోజకవర్గాలకు గాను ఇప్పటికే 10 నియోజకవర్గాల అభ్యర్థుల పేర్లను ఖరారు చేశామని, మిగిలిన 18 నియోజకవర్గాల అభ్యర్థుల పేర్లను ఖరారు చేయాల్సి ఉందన్నారు. తమకు ఎక్కడా అభ్యర్థుల కొరత లేదని స్పష్టం చేశారు.

రాజకీయాలు పక్కన పెట్టి రైతాంగాన్ని ఆదుకోండి

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర

బెంగళూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల రాజకీయాలను పక్కన పెట్టి కరువుతో అలమటిస్తున్న రైతాంగాన్ని తక్షణం ఆదుకోవాలని ప్రభుత్వాన్ని బీజేపీ కోరింది. దావణగెరె తాలూకాలోని కరువు పీడిత ఆనగోడు, జమాపుర గ్రామాల్లో సోమవారం పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు బీవై విజయేంద్ర పర్యటించారు. రైతుల కష్టాలను ఆలకించారు. అధైర్యపడవద్దంటూ వారికి ధైర్యం పలికారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మొక్కజొన్న పంట పూర్తిగా నాశనమైందని, ఎండిన పైర్లను చూసిన తనకు ఎంతో బాధేసిందని అన్నారు. ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం కరువు సాయం ప్రకటించకుండా మీనమేషాలు లెక్కిస్తుండటం విచారకరమన్నారు. తక్షణం రైతులకు పంటనష్టపరిహారం ప్రకటించి సదరు మొత్తాన్ని నేరుగా వారి ఖాతాల్లో జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రప్రభుత్వ పథకాలు మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారులకు చేరుతున్నాయన్నారు. కిసాన్ సమ్మాన్ పథకంలో భాగంగా గతంలో యడియూరప్ప ప్రభుత్వం అన్నదాతలకు అదనంగా ఏడాదికి రూ.4వేలు అందించేదని, సిద్ధరామయ్య ప్రభుత్వం దీనిని నిలిపేసిందని ఆయన ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి తప్పదన్న భయంతోనే కాంగ్రెస్ కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడుతోందని, మైసూరు ఎంపీ ప్రతాప్‌సింహ సోదరుడి అరెస్టు కూడా ఇందులో భాగమని ఆరోపించారు. రాష్ట్రంలో భయానక కరువు కారణంగా ఇంతవరకు 500 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. మైనార్టీలకు గ్రాంట్ల మంజూరు విషయంలో ఉదారంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం రైతులకు సాయం విషయంలో మాత్రం కేంద్రంపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్రం నుంచి సాయం అందలేదని ఆరోపిస్తూ కాలహరణకు పాల్పడుతోందన్నారు. ఎంపీ జీఎం సిద్దేశ్వర, ఎమ్మెల్యే బీపీ హరీష్ మీడియా సమావేశంలో పాల్గొన్నారు.




ఎండిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న విజయేంద్ర తదితరులు

లోక్‌సభ బరిలో మంత్రులు వద్దు

● కేపీసీసీ ప్రతిపాదనకు అధిష్టానం ససేమిరా



బెంగళూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ప్రజాదరణ కల్గిన మంత్రులను పోటీకి దింపాలనే రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం ఆశలు అడియాసలయ్యాయి. మంత్రులను పోటీ చేయించేందుకు పార్టీ అధిష్టానం ససేమిరా అన్నట్టు తెలుస్తోంది. ఈ విషయంలో సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ అభిప్రాయాలు వేర్వేరుగా ఉన్నట్లు సమాచారం. కేపీసీసీ అధ్యక్షుడి హోదాలో డీసీఎం శివకుమార్ నివేదికను అధిష్టానానికి పంపారు. అందులో మంత్రులు మహదేవప్ప, మునియప్ప, పరమేశ్వర్, సతీశ్‌జార్కిహొళి, రాజణ్ణ, నాగేంద్ర, రామలింగారెడ్డి, జమీర్ అహ్మద్, కృష్ణబైరేగౌడ, ఈశ్వర్‌ఖండ్రెతోపాటు సీనియర్ ఎమ్మెల్యే ఆర్‌వీ దేశ్‌పాండే పేర్లు ఉన్నట్టు సమాచారం. 1996లో జనతా పార్టీ మంత్రులకు టికెట్లు ఇచ్చి 16 స్థానాల్లో గెలుపొందడం ద్వారా దేవెగౌడ ప్రధాని అయ్యారు. అదే ఫార్ములాను కొనసాగించేందుకు డీకే శివకుమార్ అధిష్టానానికి ప్రతిపాదించినట్టు తెలుస్తోంది. తన ఆప్తులైనవారందరినీ లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేయించేందుకు సిద్దరామయ్య వ్యతిరేకించినట్టు తెలుస్తోంది. దినేశ్ గుండూరావు భార్య టబుకు బెంగళూరు సెంట్రల్‌కు, రామలింగారెడ్డి కుమార్తె సౌమ్యరెడ్డికి బెంగళూరు దక్షిణ, ఈశ్వర్‌ఖండ్రె సోదరుడు బీదర్‌కు, చామరాజనగర నుంచి మంత్రి మహదేవప్ప కుమారుడు సునిల్‌బోస్‌ను మైసూరుకు యతీంద్రను, బెళగావి జిల్లాలో మంత్రి సతీశ్‌జార్కిహొళి ఆప్తులకు టికెట్ ఇవ్వాలని సిద్దరామయ్య ప్రతిపాదన పెట్టారు. దావణగెరెలో మంత్రి మల్లికార్జున భార్య ప్రభా పేరు ఉన్నట్టు సమాచారం. కాగా సిద్దరామయ్య అభ్యంతరంతో రాహుల్‌గాంధీ సమ్మతించినట్టు తెలుస్తోంది. అభ్యర్థి ఎవరైనా గెలిపించే బాధ్యత మంత్రులకు ఇవ్వాలని అధిష్టానం సూచించినట్టు తెలుస్తోంది.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1589.08	1,624.63
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	0	9,761
సామర్థ్యం (టీఎంసీలు)	10.28	75.29

కనకదుర్గమ్మ హుండీ లెక్కింపు



లెక్కింపును పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

బళ్లారి సిటీ,జనవరి 1: నగరంలోని కనక దుర్గమ్మ దేవాలయం హుండీ సొమ్మును సోమవారం లెక్కించారు. 2023 ఆగస్టు 16నుంచి డిసెంబరు 29వరకు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నాలుగు హుండీల లెక్కింపు చేపట్టారు. మొత్తం నగదు రూ.63,49,235 వచ్చినట్లు కమిటీ సభ్యులు వెల్లడించారు. హుండీని హిందూ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ గంగాధర, ఆలయ కార్యనిర్వహణాధికారి హనుమంతప్ప, ఆలయ ప్రధాన అర్చకుడు రాజశేఖర్, సార్వతీనగర్ కేజీబీ బ్యాంక్ మేనేజర్ రామలింగప్ప నేతృత్వంలో లెక్కించారు. ప్రవీణ్ కుమార్, గాంధీనగర్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ తదితరులున్నారు.

నందిహళ్లిలో నీటి ఎద్దడి



ట్యాంకర్ల వద్ద నీటిని పట్టుకుంటున్న గ్రామస్థులు

కంప్లి, జనవరి 1 : వేసవి ప్రారంభానికే ముందే నీటి ఎద్దడి మొదలయ్యింది. హూవిన అడగళి తాలుకా నందిహళ్లి గ్రామంలో నీటి సమస్యతో ప్రజలు అల్లాడుతున్నారు. పనులకు వెళ్లకుండా ట్యాంకర్లతో వచ్చిన నీటి కోసమే కాపలా కాసే పరిస్థితి ఏర్పడిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలి పనులకు వెళ్తేగానీ బతకలేని తాము నీటి కోసం పడే బాధలు అంతా, ఇంతా కాదని గ్రామ పంచాయతీ శాఖ అధికారులు నీటి వసతి ఏర్పాటు చేసి తమ కష్టాలు తీర్చాలని గ్రామస్థులు వీరేష్, శరణప్ప, కొట్రేష్ కోరారు.



ప్రత్యేక అలంకరణలో బళ్లారి దుర్గామాత..



యర్రితాత



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



బుక్కసాగర ఏడుపడగల నాగప్ప

కోటి ఆశలతో కొత్త సంవత్సరంలోకి..

- సంబరాలతో స్వాగతం పలికిన జిల్లా ప్రజలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

కంప్లి, జనవరి 1 : కొత్త సంవత్సరానికి జిల్లా ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఆదివారం అర్ధరాత్రి వరకు రోడ్లపై సంబరాలు చేసుకుంటూ, కేకులు కట్ చేస్తూ ఆనందగా గడిపిన యువత సోమవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలతో ఆనందగా గడిపారు. ఆలయాలకు భక్తులు పోటెత్తారు. సోమవారం బుక్కసాగర వద్ద వుండే ఏడు పడగల నాగప్ప ఆలయం, అంజనాద్రి పర్వతం, వివిధ ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. పట్టణంలోని చేతన్ విద్యానికేతన్ పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు ముగ్గులు వేసి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. కురుగోడు లో హరికృప పాఠశాలలో కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు.

బళ్లారిరూరల్ : ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో చేళగుర్కి యర్రితాత ఆలయంలో నూతన సంవత్సరం సందర్భంగా రెండు రాష్ట్రాల భక్తులు పోటెత్తారు. నగరంలో ఫైర్ ఆఫీసు సమీపంలో వున్న కుమారస్వామి ఆలయంలో నూతన సంవత్సరం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో భక్తులకు అన్నదానం ఏర్పాట్లు చేశారు. బళ్లారి ప్రజల ఆరాధ్య దైవం దుర్గమ్మ దర్శనానికి భక్తులు పోటెత్తారు. కుమారస్వామి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలలో ఆలయ కమిటీ అధ్యక్షులు విజయ్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు గోవిందనాయక్, రవిచంద్ర, నిర్మల, కవిత, కృష్ణమూర్తి, ప్రకాష్, సుధాకర్, వెంకట సుబ్బారెడ్డి, ఈడి హనుమంతప్ప ఆలయంలో స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు.

సిరుగుప్ప : నూతన సంవత్సర వేడుకలను సిరుగుప్ప తాలుకా వ్యాప్తంగా ప్రజలు, యువకులు ఘనంగా నిర్వహించుకున్నారు. తాలుకా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంత ప్రజలు, పట్టణ ప్రజలు ఉల్లాసంగా, ఉత్సాహంగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు.



హరికృప పాఠశాలలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం



చేతన్ విద్యానికేతన్‌లో ముగ్గులు వేస్తున్న చిన్నారులు

తాగిన మైకంలో కత్తితో దాడి

- ఒకరి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు
- హంతకులను అరెస్టు చేసినట్లు బళ్లారి ఎస్పీ వెల్లడి
- కొత్త సంవత్సరం వేళ ఆ కుటుంబంలో తీరని విషాదం



సైదుల్లా (ఫైల్)

బళ్లారి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కొన్ని గంటల్లో 2023 ఏడాది వెళ్లిపోతుంది.. 2024 ఏడాది నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కేక్ కట్ చేసి ఆనందం పంచుకుందామనుకున్న ఓ కుటుంబానికి తీరని విషాదం మిగిలింది. కేక్ తీసుకు రావడానికి వెళ్లిన సందర్భంగా తాగిన మైకంలో ఓ యువకుడు కత్తితో దాడి చేయడంతో ఒక యువకుడు మృతి చెందగా మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. బళ్లారి జిల్లా ఎస్పీ రంజిత్‌కుమార్ బండారు సోమవారం విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. బళ్లారి నగరంలోని ఆర్ఎంనగర్‌లో ఉండే సైదుల్లా (24), రజాక్ వలి ఇద్దరూ సొంత సోదరులు. వీరు నూతన సంవత్సరం వేడుకల కేక్ కోసం ఆదివారం రాత్రి వడ్డబండ వద్ద ఉన్న ఓ బేకరీకి ద్విచక్రవాహనంలో వచ్చారు. బేకరీ ముందు బళ్లారిలోని సీరాంపుర కాలనీలో ఉండే ముఖేష్ అనే వ్యక్తి తాగి రోడ్డుపై పడిపోయాడు. ద్విచక్ర వాహనం తగులుతుందని ఆ ఇద్దరు సోదరులు తాగి పడిపోయిన ముఖేష్‌ను అక్కడి నుంచి లేపి పక్కన పడుకోబెట్టే ప్రయత్నం చేశారు. మెలకువ వచ్చిన ముఖేష్ తనను ఎందుకు లేపారు.. ఎక్కడికి వేస్తున్నారు అని గట్టిగా అరిచాడు. ఇంతలో అక్కడే ఉన్న ముఖేష్ స్నేహితులు ఏమి జరుగుతుందో తెలుసుకోకుండా గొడవకు దిగారు. ఊహించని విధంగా రాజేష్ అనే యువకుడు తన ద్విచక్ర వాహనంలోని లగేజీ బ్యాగ్ నుంచి కత్తి తీసి సైదుల్లా, అతని సోదరుడు రజాక్‌వలిపై దాడిచేశాడు. కత్తిపోట్లకు గురైన సైదుల్లా అక్కడిక్కడే మృతి చెందాడు. రజాక్‌వలి తీవ్ర గాయాలతో విమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఎస్పీ తెలిపారు. హత్యకు పాల్పడిన రాజేష్, ముఖేష్, వెంకటేశ్ అనే యువకులను గుర్తించి వీరిలో రాజేష్, ముఖేష్‌ను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. వెంకటేశ్ అనే నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితులు అందరూ తాగిన మైకంలో ఉన్నారని వివరించారు. ఊహించని ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోవడం, మరొకరు ప్రాణాప్రాయస్థితిలో ఉండడం చూసి వారి తల్లి కన్నీరు మున్నీరుగా రోదించింది. చిన్న వయసులోనే భర్తను పోగొట్టుకుని ఆర్ఎం కాలనీలో టైలరింగ్ పని చేసుకుంటూ పిల్లలను పోషిస్తోంది. చేతికొచ్చిన కొడుకులు ఇద్దరూ ఇలా కావడంతో ఆ తల్లి పరిస్థితిని చూసి కాలనీ వాసులు కన్నీటి పర్యంతమయ్యారు.

బడిలో..డిష్యుం డిష్యుం

- ఆయుధాలతో దాడికి విద్యార్థుల యత్నం
- స్టేషన్‌కు తరలించి విచారించిన పోలీసులు

రాయచూరు జనవరి 1: పెన్నులు, పుస్తకాలతో ఉండాల్సిన విద్యార్థులు మారణాయుధాలు చేతబట్టి దాడులకు దిగడం అందరినీ విస్మయానికి గురి చేసింది. ఈ అరుదైన సంఘటన సోమవారం నగరంలోని మదర్ ట్రస్ట్ పాఠశాల వద్ద చోటు చేసుకుంది. జ్యోతి కాలనీలో ఉన్న ఈ పాఠశాలలో 7,9 తరగతి చదువుతున్న విద్యార్థుల మధ్య శనివారం కొద్దిపాటి ఘర్షణ చోటు చేసుకోగా దాన్ని మనస్సులో ఉంచుకున్న విద్యార్థులు సోమవారం పాఠశాల సమయానికంటే ముందే అక్కడికి చేరుకుని పరస్పరం దాడులకు దిగారు. ఈ దాడుల్లో 7వ తరగతి చెదువుతున్న విద్యార్థి తన సహచరులను పాఠశాల వద్ద పిలిపించాడు. ఎయిర్ గన్‌లు, చాకులు వెంట తెచ్చుకుని 9వ తరగతి చెదువుతున్న విద్యార్థి పై దాడికి ప్రయత్నం చేయడం అందరినీ విస్మయానికే కాదు భయాందోళనలకు కూడా గురి చేసింది. విషయం తెలుసుకున్న వెస్ట్ పోలీసులు వెంటనే పాఠశాల వద్దకు చేరుకుని విద్యార్థులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ చేపట్టారు. విచారణ కొనసాగుతున్నట్లు పోలీసులు ధ్రువీకరించారు. కాగా పాఠశాల సమీపంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు విద్యార్థులు పరస్పరం చేసుకున్న దాడుల గురించి పోలీసులు తమ విచారణలో గుర్తించినట్లు వెస్ట్ పోలీసులు తెలిపారు.



పాఠశాల వద్ద గుమిగూడిన స్థానికులు, విద్యార్థులు
విద్యార్థులు తెచ్చిన ఆయుధాలు

ఎళుచ్చి సంఘం ప్రారంభం

హోసూరు (సిప్‌కాట్) జనవరి 1: ముత్తరైయ్యార్ స్థానికులు ఎళుచ్చి సంఘం తరపున హోసూరులో కమ్మ భవనంలో సమావేశం జరిగింది. కార్యక్రమానికి సంఘం అధ్యక్షుడు కాశిరాజన్ అధ్యక్షత వహించారు. కార్యదర్శి సెందిల్ కుమార్ అందరికీ స్వాగతం పలికారు. ముత్తరైయ్యార్ వాన్ కానల్ వ్యవస్థాపకుడు ఈరోడ్ సెల్వరాజ్, బహువిధ నిపుణుడు సుబ్రహ్మణియన్ కీలకోపన్యాసం చేశారు. ముత్తరైయ్యార్ సామాజిక వర్గాన్ని తమిళనాడు అంతటా ఏకరీతిగా జాబితాలో చేర్చాలని తిరుచ్చిలో నిర్మించిన ముత్తరైయ్యార్ మణిమండపం త్వరగా తెరవాలని, హోసూరు మీదుగా తిరుచ్చికి అదనపు రైళ్లు నడపాలన్నారు. కార్యక్రమంలో గౌరవ కన్సల్టెంట్లు సుకుమారన్, తమిళసెల్వన్, డాక్టర్ విమల తమిళసెల్వన్, ఈడీ అండ్ కో ప్రొప్రైటర్ పెరియస్వామి, ఇంజనీర్ రామమూర్తి, కోశాధికారి గణేశన్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

రుణ జాబితా విడుదల

బళ్లారి సిటీ, జనవరి 1: నగరంలోని జిల్లాపంచాయతీ హాలులో సోమవారం జరిగిన కమిటీ సమావేశంలో 2024-25 సంవత్సరానికి 'సంభావ్య' రుణ ప్రణాళికను జడ్పీ సీఈఓ రాహుల్ శరణప్ప సంకనూర్ విడుదల చేశారు. పంట రుణానికి రూ.2,551.50కోట్లు, వ్యవసాయ దీర్ఘకాలిక రుణాలకు రూ. 1038.79కోట్లు, వ్యవసాయ మౌలిక సదుపాయాలకు రూ.75.78కోట్లు, వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలకు రూ. 250.18కోట్లు, వ్యవసాయ రంగానికి కలిపి రూ.3916.33 కోట్లు కేటాయించినట్లు నాబార్డు జిల్లా డెవలప్‌మెంట్ మేనేజర్ ఆర్.ఎస్. యువరాజ కుమార్ తెలిపారు. సూక్ష్మ చిన్న, మధ్యతరహా పరిశ్రమలను రూ.2661.38 కోట్లు, ఎగుమతులకు రూ. 25.60 కోట్లు, విద్యకు రూ.56.70కోట్లు , స్థిర ఓవరాల్ ప్రాధాన్య రంగానికి రూ.6891.82కోట్లు కేటాయించామన్నారు. ఎల్‌డీఓఎమ్ పాఠక్, సోమనగౌడ బినాహూర్, పలు బ్యాంకుల అధికారులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్పీ సీఈఓ రాహుల్ శరణప్ప తదితరులు



మాట్లాడుతున్న లారీ యజమానుల సంఘం నాయకులు

ఓవర్ లోడ్‌ను అరికట్టాలి: లారీ యజమానుల సంఘం

బళ్లారి సిటీ, జనవరి 1: అద్దె రేట్ల పెంపు, ఓవర్‌లోడ్, నైట హాల్ట్ ఛార్జీల పెంపుదల, నగరంలో ఓవర్ లోడ్ స్పాంజ్‌ఐరన్ రవాణాను నిషేధించాలని బళ్లారి జిల్లా లారీ ఓనర్స్ అసోషియేషన్ కార్యదర్శి బసవరాజ్, విశ్వనాథ్ డిమాండ్ చేశారు. సోమవారం నగరంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 2021-2024వరకు, ఫ్యాక్టరీల యజమానులు స్పాంజ్ ఐరన్ రవాణాకోసం తమ అసోషియేషన్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. కానీ ఇప్పుడు టన్నుకు గిట్టుబాటు ధర కాకుండా రూ. 200 నుంచి 250 రుపాయలు తక్కువ ఇస్తున్నారన్నారు. నిబంధనలు మించి ఓవర్‌లోడ్ చేస్తున్నారని, ఓ వైపు డీజిల్ ధర పెరిగింది. మరోవైపు ఇతర ధరలు పెరగడంతో అద్దె రేటును పెంచి ఓవర్ లోడ్‌ను అరిక ట్టాలన్నారు. దీని కోసం జనవరి 3న స్పాంజ్ ఐరన్ రవాణాపై నిషేధం విధించబడుతుందన్నారు. ఈవిషయాన్ని అసోషియేషన్ ఇతర రాష్ట్రాల ట్రక్ డ్రైవర్లకు కూడా తెలియజేసింది. ఫ్యాక్టరీ దగ్గర కరపత్రాల పంపిణితో పాటు లౌడ్ స్పీకర్ల ద్వారా ప్రకటన చేస్తారన్నారు. ఈసందర్భంగా అధ్యక్షుడు పెద్దన్న, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, నారాయణస్వామి, తిప్పయ్య తదితరులున్నారు.

పయ్యావుల కేశవ్ గెలవాలని దుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

బళ్లారిరూరల్, జనవరి 1 : నగరంలోని కనకదుర్గమ్మ ఆలయంలో ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అభిమానులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో కేశవ్ గెలుపొందాలని, ఏపీలో టీడీపీ అధికారంలోకి రావాలని కోరుతూ కమ్మ సంఘం నాయకులు అమ్మవారి ఆలయం ముందు టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీ అభివృద్ధి చెందాలంటే బాబుతోనే సాధ్యమన్నారు. పూజల్లో వెంకటనాయుడు, యర్రిస్వామి, లింగన్న, కోనంకి మోహన్, బాబు, నెట్టప్ప, రంగ య్య, కిష్టప్ప తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



టెంకాయలు కొడుతున్న కమ్మ సంఘం నాయకులు

హోసూరు జోన్

ఘనంగా వేరుశనగ ఉత్సవం



ఉత్సవంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ మాదేశ్వరన్ తదితరులు

హోసూరు, జనవరి 1: హోసూరు రాజగణపతి నగర్ ప్రాంతంల్లో పురాతన వరసిద్ధి అంజనేయ స్వామి ఆలయంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం వేరుశనగ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏటా నిర్వహించే రీతిలోనే సోమవారం రాజగణపతి వరసిద్ధి ఆంజనేయ స్వామి ఆలయంలో 66 వ వార్షికోత్సవ వేరుశనగకాయల ఉత్సవం జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక హోమాలు, వివిధ అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలతో స్వామి వారిని అలంకరించారు. రాశిగా పోసిన వేరుశనగకు పూజలు నిర్వహించి భక్తులకు పంపిణీ చేశారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ పూజలు సాగాయి. ఆలయంపై శనక్కాయలు వేసి భక్తులు తమ మొక్కులు తీర్చుకుంటారు. హోసూరు మున్సిపల్ కమిటీ చెర్మన్ మాదేశ్వరన్, కృష్ణమూర్తి, జైశంర్‌ర్‌తో పాటు పెద్ద సంఖ్యలో ప్రజాప్రతినిధులు కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకున్నారు.

ఆలయాలకు నూతన సంవత్సర శోభ







నగరంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక అలంకరణలో దేవతామూర్తులు

హోసూరు (మత్తిగిరి), జనవరి 1: ఆంగ్ల నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని హోసూరు ఆలయాలు, ప్రార్థనామందిరాలలో సోమవారం విశేషపూజలు సాగాయి. హోసూరు కార్పొరేషన్‌లో సిఎస్ఐ, ఆర్‌సీ చర్చ్‌లు, మత్తిగిరి ఆరోగ్యమాత మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు పరస్పరం నూతన సంవత్సరం శుభాకాంక్షలు చెప్పారు. అదేవిధంగా హోసూరు చంద్రచూడేశ్వర స్వామి ఆలయం, కోట మారియమ్మ అలయం, వరసిద్ధి వినాయక ఆలయం, రామాలయం, పెరియార్ నగర్ వేల్‌మురుగన్ ఆలయం, రాంనగర్‌లో సోమేశ్వర స్వామి ఆలయం, అదే విధంగా హోసూరు పక్కనే ఉన్న ఉద్దన్నపల్లి సమీపాన ఉన్న బండపల్లి గ్రామంలో దక్షిణనది ఒడ్డున వెలసిన భైరవేశ్వర ఆలయం, ఇలా అన్ని దేవాలయాలలోనూ భక్తులతో కిటకిటలాడాయి. కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు పాల్గొని పొడవాటి క్యూలో వేచియుండి దర్శించుకున్నారు. అదే విధంగా హోసూరు తర్వాత కెలమంగలం జీవనగర్‌లోని వెక్కాళియమ్మన్‌కు ప్రత్యేక అభిషేకం, అలంకరణలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు.

200 చోట్ల మన్ కీ బాత్ ప్రసారం

హోసూరు జనవరి 1: ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్ కీ బాత్ కార్యక్రమం హోసూరు సహా 200 బూత్‌లలో ఆదివారం ప్రసారం చేశారు. హోసూరు, డెంకణీకోట, కెలమంగలం, తళి, శూలగిరి, వేపనపల్లిలోని బీజేపీ కార్యాలయాలు, బూత్ స్థాయిలో ప్రత్యేక బుల్లితెరలు ఏర్పాటు చేసి వీక్షించారు. హోసూరు పోలింగ్ కేంద్రంలో జరిగిన కార్యక్రమానికి నగర అధ్యక్షుడు మణికంఠన్ అధ్యక్షతన వహించారు. బీజేపీ పశ్చిమ జిల్లా అధ్యక్షుడు నాగరాజ్, జిల్లా ఉపాధ్యక్షుడు మురుగన్, జిల్లా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, శాఖ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. పశ్చిమ జిల్లాలో పలు చోట్ల జరిగిన బీజేపీ కార్యకర్తలు, ప్రజలు వీక్షించారు.



మన్ కీ బాత్‌లో పాల్గొన్న బీజేపీ సభ్యులు

మానవ జన్మను సార్థకం చేసుకోండి

- బ్రహ్మశ్రీ వెంకటేశ్వర స్వాములు

హోసూరు, జనవరి 1: మానవ జన్మ ఎంత విలువైనదో సమయం కూడా అంతే విలువైనదని, వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని బ్రహ్మశ్రీ వెంకటేశ్వర స్వాములు అభిప్రాయపడ్డారు. ధనుర్మాస పూజలో భాగంగా సోమవారం నూతన సంవత్సరం కావడంతో ఆయన ప్రత్యేకంగా ఉపన్యాసం చేశారు. నారేయణ తాత ఆశ్రమంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంల్లో ఎక్కువ సంఖ్యల్లో భక్తాదులు పాల్గొన్నారు. స్వామిజీ ప్రసంగిస్తూ ఆనందమే పురుషార్థమని, ఆనంద మార్గం ఒక ఆధ్యాత్మిక పుణ్యం లభిస్తుందని తెలిపారు. నూతన సంవత్సరం తమకు అనుకూలిస్తుందని, మానవుడు ఆశల ఉన్నతిలో పయణిస్తాడన్నారు. కానీ తాము చేయవలసిన పని మరచి సమయాన్ని వృథా చేస్తూ కాలం ముందుకు సాగిస్తున్నాడన్నారు. క్రమశిక్షణతో చేస్తూ తాను కష్టపడి పనిచేసినప్పుడే తాను అనుకున్నది సాధిస్తాడన్నారు. ఆధ్యాత్మికతకోసం ఒక గంట కేటాయిస్తే జీవితం విలువ అర్థమవుతుందన్నారు. పలు కారణాలతో బిజీ బిజి అనే పదాల్లో మునిగిపోయి వెనక్కి తిరిగి చూస్తే జీవితం వృథా అయ్యిందని కనిపిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ సుఖ శాంతులతో ఉండాలని, అదే తమ ప్రపంచమని మనిషి తెలుసుకోవాలని అందరికి మంచిది జరగాలని ఆ భగవంతునిని ప్రార్థిస్తున్నానని తెలిపారు. కార్యక్రమాన్ని తపోవనం అధ్యక్షులు శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించి అన్నదానం నిర్వహించారు.



ప్రసంగిస్తున్న స్వామీజీ

రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వినతి

హొసపేట,జనవరి 1: రెవెన్యూ శాఖలో ఉద్యోగులు తీవ్ర పని ఒత్తిడితో సతమతమవుతున్నారని, కొందరు ఉద్యోగులు గుండెపోటుకు గురైన సందర్భాలూ ఉన్నాయని, తమ సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. సోమవారం సంఘం అధ్యక్షుడు అందనగౌడ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెవెన్యూ కార్యాలయాల్లో అనేక లోటు పాట్లను సరిచేయాలని, రాష్ట్ర రెవెన్యూ శాఖలో ఖాళీగా ఉన్న సుమారు 4వేల గ్రామ పరిపాలన అధికారులు, పీడీఎస్, డీవీడీఎస్ ఇతర పోస్టులను భర్తీ చేయాలని వారు కోరారు. జిల్లాకలెక్టర్ ద్వారా రెవెన్యూ శాఖ మంత్రికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు అందనగౌడ, డీ.ఈ.ఓ ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక శిల్ప చక్రవర్తి జక్కనాచార్యులు : ఏడీసీ



జక్కణాచార్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏడీసీ మహ్మద్ జుబేరా, సిబ్బంది

బళ్లారి సిటీ, జనవరి 1: దేశంలో అత్యంత అరుదైన శిల్పకళను అందించిన జక్కనాచార్యులు, కర్ణాటక శిల్ప చక్రవర్తి అని జిల్లా ఏడీసీ మహ్మద్ జుబేరా ప్రశంసించారు. జిల్లాపరిపాలన, జిల్లాపంచాయతీ, కన్నడ, సాంస్కృతిక శాఖ, మహానగర కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ రాజ్‌కుమార్ రోడ్డులోని సాంస్కృతిక శాఖ భవనంలో సోమవారం నిర్వహించిన విశ్వకర్మ అమరశిల్పి జక్కనాచారి జయంతిని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అమర శిల్పి జక్కనాచారి గొప్ప జ్ఞాని, కళాత్మక ప్రవృత్తిని అలవరచుకుని అనేక దేవాలయాలను నిర్మించిన పురాణ శిల్పి అని.. బేలూరు, హళేబీడులలో చాళుక్యులు, హోయసలుల కాలంలో ఆలయాలను నిర్మించినట్లు తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రొఫెసర్ విశ్వనాథ్ మాట్లాడుతూ జక్కనాచారి తుమకూరులోని గార్దాపూర్ గ్రామంలో జన్మించారని, తన తండ్రిని వెంబడించి తానూ ఒక ప్రసిద్ధ శిల్పిగా ఎదిగాడన్నారు. డిప్యూటీ మేయర్ జానకి, కన్నడ సాంస్కృతిక శాఖ సంచాలకులు హో న్నూరప్ప, చరిత్ర అకాడమీ జిల్లాధ్యక్షుడు టీహెచ్ బసవరాజు, విశ్వకర్మసంఘం జిల్లా అధ్యక్షుడు మిషన్నంద్ర పాల్గొన్నారు.

సిరుగుప్ప : అమరశిల్పి జక్కన్న చరిత్ర ఘనసీయమైనదని తహసీల్దార్ విశ్వనాథ్ పేర్కొన్నారు. సోమవారం సిరుగుప్ప పట్టణ తహసీల్దార్ కార్యాలయంలో అమరశిల్పి జక్కన్న జయంతి వేడుకలను పురస్కరించుకుని ఈ కార్యక్రమంలో విశ్వకర్మ స మాజ అధ్యక్షుడు మౌనేష్ ఆచా రి, మాజీ అధ్యక్షుడు కాళింగ ఆచారి, ప్రముఖులు వీరేష్ ఆచారి, భాస్కర్ ఆచారి, అబ్దుల్ నబీ, తదితరులు పాల్గొన్నారు.



సిరుగుప్పలో...



రాయచూరు డీసీ కార్యాలయంలో..

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంబ్...

కేఎం మాథ్యూ (జయంతి)



'పద్మభూషణ్' గ్రహీత కంద మాథిల్ మమ్మెన్ (కేఎం) మాథ్యూ 1917 జనవరి 2న కొట్టాయంలో జన్మించారు. 'మళయాళ మనోరమ' దిన పత్రికకు ఎడిటర్ ఇన్ చీఫ్‌గా వ్యవహరించారు. పలుభాషలలో పాఠకుల విజ్ఞానాన్ని, పఠనాసక్తిని పెంపొందించే 'మనో రమ ఇయర్ బుక్' ఎంతో పేరొందింది. ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్స్ (ఏబీసీ), ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా (పీటీఐ) ఛైర్మన్‌గా వ్యవహరించారు. నేషనల్ సిటిజన్స్ అవార్డ్ పలు పురస్కారాలు అందుకున్నారు. 2010 ఆగస్టు 1న కన్నుమూశారు.

దైసకు ఇకెడా (జయంతి)



దైసకు ఇకెడా 1928 జనవరి 2న జపాన్ దేశం టోక్యోలో జన్మించారు. బుద్ధ తత్వవేత్త, విద్యా వేత్త, రచయిత. సోకా గక్కై ఇంటర్నేషనల్ (ఎస్‌జీఐ) మూడవ అధ్యక్షుడిగా, గౌరవ అధ్యక్షుడిగా వ్యవహరించారు. ప్రపంచ వ్యాప్తంగా 192 దేశాలలో బుద్ధిస్టులు ఎస్‌జీఐ లో సభ్యులుగా ఉన్నారు. ఐక్యరాజ్యసమితిచే 'యునైటెడ్ నేషన్స్ పీస్ మెడల్', దేశం తరపున 'ఠాగూర్ పీస్ అవార్డు' ఇతర పురస్కారాలు పొందారు. 2023 నవంబరు 15న కన్నుమూశారు.

ఆదిభట్ల నారాయణ దాసు (వర్ధంతి)



అజ్జాడ ఆదిభట్ల నారాయణదాసు 1864 ఆగస్టు 31న జన్మించారు. సంగీత, సాహిత్య మేళవింపుతో హరికథా ప్రక్రియను సృజించి 'హరికథా పితామహ'గా పేరొందారు. సంస్కృతాంధ్రాలలో పలు రచనలు చేసిన రచయిత, కవి, బహుభాషా కోవిదుడు, తాత్వికుడు. తెలుగు, సంస్కృతం, తమిళం, హిందీ, బెంగాలీ, ఉర్దూ, ఆంగ్లం, అరబిక్, పార్శీ భాషాలలో ప్రావీణ్యం పొంది అష్టావధానాలు చేశారు. విజయనగరం మహారాజు స్థాపించిన విజయరామ గాన పాఠశాలకు తొలి ప్రధానోపాధ్యాయుడిగా వ్యవహరించారు. 1945 జనవరి 2న కన్నుమూశారు.

పిలకా గణపతి శాస్త్రి (వర్ధంతి)




పిలకా గణపతి శాస్త్రి 1911 ఫిబ్రవరి 24న తూర్పు గోదావరి జిల్లా కట్టుంగ గ్రామంలో జన్మించారు. కవి, వ్యాఖ్యాత, నవలా రచయిత, అను వాదకుడు, ఆర్ష విద్వాంసుడు, పత్రికా సంపాదకుడు. విజయ నగరం సంస్కృత కళాశాలలో సాహితీ విద్యాప్రవీణ పట్టా పొందారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతి అందుకున్నారు. 1983 జనవరి 2న కన్నుమూశారు.

చంద్రశేఖర కంబార (పుట్టినరోజు)



'పద్మభూషణ్' గ్రహీత చంద్రశేఖర కంబార 1937 జనవరి 2న కర్ణాటక రాష్ట్రం బెళగావి జిల్లాలో జన్మించారు. కన్నడ సాహిత్యంలో తనదైన గుర్తింపుతో జ్ఞానపీఠ పుర స్కారం పొందారు. హంపిలోని కన్నడ యూనివర్శిటీకి ఫౌండర్ వైస్ ఛాన్సెలర్, సాహి త్య అకాడమీ అధ్యక్షుడిగా వ్యవహరించారు. రచయిత, సినీ దర్శకుడు కూడా. ప్రత్యేకించి ఉత్తరకర్ణాటక శైలిలో రచనలు, పద్యాలు ఉంటాయి. కర్ణాటక లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు నామినేట్ అయ్యారు. జ్ఞానపీఠ, పద్మశ్రీ పురస్కారాలతోపాటు కబీర్ సమ్మాన్, కాళిదాస్ సమ్మాన్, పంప అవార్డులు పొందారు.

డాక్టర్ పరకాల ప్రభాకర్ (పుట్టినరోజు)



పరకాల ప్రభాకర్ 1959 జనవరి 2న నరసాపూర్‌లో జన్మించారు. పొలిటికల్ ఎకనామిస్ట్, విమర్శకులు, ఆర్థిక, సామాజిక అంశాలపై పట్టు కలిగినవారు. లండన్ స్కూల్ ఎకనామిక్స్‌లో పీహెచ్‌డీ చేశారు. 2014-18 మధ్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో కేబినెట్ హోదా కలిగిన కమ్యూనికేషన్స్ అడ్వైజర్‌గా పనిచేశారు. ప్రజారాజ్యం పార్టీ ప్రతినిధిగాను, బీజేపీ ప్రతినిధిగాను వ్యవహరించారు. కాగా ఆయన సతీమణి నిర్మలా సీతారామన్ కేంద్ర ఆర్థికమంత్రిగా ఉన్నారు.

సంజితా చాను (పుట్టినరోజు)



సంజితాచాను ఖుముచ్చమ్ 1994 జనవరి 2న మణిపూర్‌లో జన్మించారు. వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారిణి. దేశం నుంచి రెండు సార్లు కామన్‌వెల్త్ గేమ్స్ ఛాంపియన్ షిప్‌లో పోటీ చేశారు. 2014లో గ్లాస్గో బంగారుపతకం, 2018 గోల్డ్‌కోస్టులలో 48కేజీల, 53 కేజీల విభాగంలో సత్తా చాటుకున్నారు. 84కిలోల విభాగంలో స్నాచ్ సెగ్మెంట్‌లోనూ రికార్డు నెలకొల్పారు.

మిథిక్ సొసైటీ అధ్యక్షుడిగా నాగరాజ్

బెంగళూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని మిథిక్ సొసైటీ అధ్యక్షునిగా వీ నాగరాజ్ ఎన్నికయ్యారు. సొసైటీ సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. గౌరవ కార్యదర్శిగా ఎస్ రవి, ఉపాధ్యక్షురాలిగా వీ అనూరాధ, గౌరవ కోశాధికారిగా కేఎస్ హిరియణ్ణయ్య ఎన్నికయ్యారు. కాగా పాలక మండలి సభ్యులుగా ఎస్ తిప్పేస్వామి, ఎంఆర్ ప్రసన్నకుమార్, ఎం కోట్రేష్, ఎస్ సుదర్శన్, ఎంజీ చంద్రకాంత్, ఎస్.నరహరిరావ్, కెఎస్ శ్రీధర, కె.మాధవరావ్ హెబ్బార్ ఎన్నికైనట్లు నగరంలో సోమవారం విడుదలైన ప్రకటనలో పేర్కొన్నారు.

డిపోలో ప్రమాదం : ఉద్యోగి మృతి

బాగేపల్లి, జనవరి 1: పట్టణ శివారులోని కేఎస్ఆర్టీసీ డిపోలో బస్సును శుభ్రం చేస్తున్న వేళ మరొక బస్సు ఢీ కొనడంతో మంజునాథ్ అనే కంట్రాక్టు ఉద్యోగి మృతి చెందాడు. ఎప్పటిలాగే మంజునాథ్ డిపోలోని సర్వీస్ స్టేషన్‌లో ఆదివారం విధులు నిర్వహిస్తున్నాడు. కేఏ 40 ఎఫ్ 1281 బస్సు వెనుక ఉన్న అద్దాన్ని తుడుస్తుండగా మరో బస్సు ఢీ కొంది. దీంతో మంజునాథ్ తీవ్ర గాయాలై ఘటనా స్థలంలోనే మృత్యువాత చెందాడు. బాగేపల్లి పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఏడాదంతా పీఈఎస్ స్వర్ణోత్సవాలు

- నాలుగు రోజుల పాటు సాంకేతిక సదస్సు
- ప్రొ-చాన్స్‌లర్ డి.జవహర్

బెంగళూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): సమాజానికి గుణాత్మకమైన విద్య అందించాలనే లక్ష్యంతో 1972లో ఆరంభమైన పీఈఎస్ విద్యాసంస్థ కేజీ నుంచి ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలల ద్వారా ఏటా 30వేలమందికి విద్య అందిస్తోందని స్వర్ణోత్సవాల సంబరాలు ఏడాదిపాటు జరపదలిచామని ప్రొ-చాన్స్‌లర్ డీ జవహర్ వెల్లడించారు. సంబరాలను సాంకేతికతకు అనుగుణంగా యువ ఇంజనీరింగ్ విద్యార్థులలో కొత్త ఆలోచనలు కలిగించేలా నాలుగురోజులపాటు ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. దేశంలోనే ప్రముఖ మేథావులను సాంకేతిక సదస్సులలో భాగస్వామ్యులను చేస్తున్నామన్నారు. ఓవైపు సదస్సులు మరోవైపు పూర్వ విద్యార్థుల అనుభవాలు, సాంస్కృతిక సందడి కొనసాగనుందన్నారు. ఈ నెల 3నుంచి 6వ తేదీ దాకా సాంకేతిక సదస్సులు సాగుతా యన్నారు. ప్రతిరోజూ సాయంత్రం 5 గంటలనుంచి రాత్రి 10వరకు ఉంటాయన్నారు. 3న పీఈఎస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ దొరస్వామి సదస్సును ప్రారంభిస్తారన్నారు. సాంకేతిక పునరుజ్జీవనం - పాలనా పునర్విమర్శ అనే అంశాలపై జేఎన్‌యూ ఢిల్లీ ప్రొఫెసర్ డాక్టర్ ఆనంద్ రంగనాథన్ తొలి ప్రసంగం ఉంటుందని ఆ తర్వాత ఇన్‌మొబి గ్రూప్ వ్యవస్థాపక సీఈఓ నవీన్ తివారి, అనంతరం లాయిస్ సర్వీస్ సీనియర్ డైరెక్టర్ రమ్య విశ్వనాథ్ భాగస్వామ్యులవుతారన్నారు. యువ సాధకుడు బ్యాక్‌యార్డ్ క్రియేటర్స్ ఫౌండర్ రమణ్, లక్ష్మణ్‌లు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతారన్నారు. పూర్వ విద్యార్థి ఐఏఎస్ అధికారి శ్రేయస్ హోసూరు పాల్గొంటారన్నారు. రాత్రి అబ్బీ ఆయన డ్యాన్స్‌లు ఉంటాయన్నారు.

ఎడిటర్ స్వామినాథన్ ప్రసంగం

4న గురువారం విఘాతం కల్పించే అంశాల పునరుద్ధరణ - ఆవిష్కరణ, యథాస్థితి అనే అంశంపై తుగ్లక్ ఎడిటర్ స్వామినాథన్ గురుమూర్తి తొలి ప్రసంగం కాగా మెట్రో ఇంటెగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ మాజీ జీఎం సుధాన్షుమణి, అనంతరం సిస్కో స్టార్టప్స్ హెడ్ శృతి కణ్ణన్, యువ సాధకుడు ప్రొక్లైమ్ సీటీఓ గగన్‌రెడ్డి, పూర్వ విద్యార్థి డాక్టర్ గౌరి శ్రీనివాస్ ప్రసంగిస్తారన్నారు. 5న శుక్రవారం ప్రధానమంత్రి కార్యాలయం ఆర్థిక సలహాదారులు సంజీవ్ సన్యాల్ ప్రధాన ప్రసంగం ఉంటుందన్నారు. ఆ తర్వాత కాజ్ వెంచర్స్ మేనేజింగ్ పార్ట్‌నర్ బీవీ జగదీశ్, యువ సాధకుడు అగామి కో-ఫౌండర్ సచిన్ మల్హాన్‌ల ప్రసంగాలు ఉంటాయన్నారు. ఆ తర్వాత కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి డాక్టర్ జైశంకర్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడతారని, ఎంపీ తేజస్వి సూర్యతో కలసి పుస్తకాలు విడుదల చేస్తారన్నారు. రాత్రికి కైలాశ్‌ఖేర్ ప్రదర్శన ఉంటుందన్నారు. 6న పర్యావరణ వ్యవస్థల పునరుద్ధరణ, సుస్థిర మార్గం అనే అంశంపై సుప్రీంకోర్టు న్యాయవాది, రచయిత సాయి దీపక్ జైకుమార్ తొలి ప్రసంగం, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ సుధామూర్తి ప్రసంగం, ఇంక్ సీఈఓ లక్ష్మీ ప్రొటరీ, ఇంక్ ఈడీ అనుశ్కా దుబేల ప్రసంగాలు ఉంటాయన్నారు. పూర్వ విద్యార్థి ఉద్యమ్ వ్యవస్థాపకుడు మేకిన్ మహేశ్వరి, విప్రో ప్రెసిడెంట్ అశోక్ ద్వారకనహళ్ళి పాల్గొంటారన్నారు. ప్రతిరోజూ ఛైర్మన్ ప్రసంగం కొనసాగుతుందని, చివరి రోజు శంకర్‌మహదేవన్ సంగీత కచేరీ ఉంటుందన్నారు. మీడియా సమావేశంలో పీఈఎస్ వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ జే సూర్యప్రసాద్, రిజిస్ట్రార్ కేఎస్ శ్రీధర్, డీన్ కృష్ణలు ఉన్నారు.



స్వర్ణోత్సవాల బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ప్రొ-చాన్స్‌లర్ డి.జవహర్ తదితరులు

వరుణలో బయటపడిన
11వ శతాబ్దపు జైన విగ్రహాలు



బయటపడిన పురాతన విగ్రహాలివే...

బెంగళూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మైసూరు జిల్లాలోని వరుణ గ్రామ పరిధిలో కాలువపనులు చేస్తుండగా పురాతనమైన జైన విగ్రహాలు డిసెంబరు 27న బయటపడ్డాయి. వీటిలో కూష్మాండిని, జైన తీర్థంకర విగ్రహాలు ఉన్నాయి. మరో విగ్రహానికి తల మాత్రమే లభించింది. ఈ విగ్రహాలు 11వ శతాబ్దానికి చెందినవని చరిత్ర నిపుణులు ప్రొఫెసర్ ఎన్ఎస్ రంగరాజు అభిప్రాయపడ్డారు. వరుణలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 11వ శతాబ్దం గంగర, హొయసళ పాలన ఉండేదన్నారు. మైసూరులోని వెల్లింగ్టన్ భవనం లోని మ్యూజియంకు తరలించామన్నారు. పొక్లైనర్ ద్వారా కాలువ కోసం పనులు సాగుతుండగా విగ్రహాలు బయటపడ్డాయన్నారు. వెంటనే గ్రామస్థులు పనులు నిలిపివేయించారన్నారు. మూడు రోజులుగా వాటిపై సమగ్ర పరిశోధన చేశామని పురావస్తుశాఖ డిప్యూటీ డైరెక్టర్ మంజుళ తెలిపారు. తవ్వకాలలో బయటపడిన మూడు విగ్రహాలు ఛిద్రమయ్యాయని, కూష్మాండిని దేవి చేయి విరిగిందన్నారు. జైన తీర్థంకర విగ్రహాలకు చేతులు, కాళ్ళు ధ్వంసమయ్యాయని, మరో విగ్రహానికి సంబంధించి తల మాత్రమే లభించిందన్నారు. దీన్నిబట్టి హొయసళ రాజులు ఈ ప్రాంతాన్ని పరిపాలించారని తెలుస్తోందన్నారు.

సహకార బ్యాంకులు
ప్రజల విశ్వాసాన్ని చూరగొనాలి

బెంగళూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ది మైసూరు సిల్క్ క్లాత్ మర్చంట్స్ కో ఆపరేటివ్ బ్యాంకు తన పేరును వాసవి సహకార బ్యాంకుగా మార్చుకుంది. ఈ నేపథ్యంలో నగరంలో జరిగిన కార్యక్రమంలో రవాణా, దేవాదాయ శాఖ మంత్రి ఆర్ రామలింగారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కాగా ఈ నూతన సహకార బ్యాంకు తాను సేకరించిన రూ.500 కోట్లలో రూ 350 కోట్లను ప్రజలకు రుణాల రూపంలో అందజేయాలని నిర్ణయించడం ఎంతో సంతోష దాయకమన్నారు. కెనరాబ్యాంకు కూడా గతంలో చాలా చిన్న బ్యాంకేనని ఇప్పుడు అంతర్జాతీయ స్థాయికి ఎదిగిందని పేర్కొన్న ఆయన ఖాతాదారుల విశ్వాసాన్ని చూరగొంటే ఈ లక్ష్యాన్ని అందుకోవడం పెద్ద కష్టమేమీకాదన్నారు. కార్యక్రమంలో బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ సభ్యుడు పీసీ మోహన్ మాట్లాడుతూ సహకార బ్యాంకులు చాలా వరకు రుణ బకాయిల సమస్యతో అలమటిస్తున్నాయన్నారు. అవసరాల కోసం రుణాలు తీసుకున్న వారు సకాలంలో తీరిస్తే సహకార బ్యాంకుల మనుగడ ఉజ్వలంగా ఉంటుందన్నారు. రాష్ట్రంలో పదేళ్ళ క్రితం 3 కోట్ల మంది మాత్రం బ్యాంకుల్లో ఖాతాలను కలిగి ఉండేవారని తాజాగా ఈ సంఖ్య 58 కోట్ల మంది ఖాతాలను కలిగి ఉన్నార న్నారు. బెంగళూరు దక్షిణ ఎంపి తేజస్వి సూర్య, వాసవి పీఠానికి చెందిన సచ్చిదానంద సరస్వతి స్వామిజీ, వాసవి ఎంఎస్‌సిఎం కో ఆపరేటివ్ బ్యాంకు అధ్యక్షుడు ఎన్ఎస్.శ్రీనివాసమూర్తి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో ప్రముఖులు

పథకాలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రశాంత్‌పాటిల్

బాగేపల్లి, జనవరి 1: సామాజిక భద్రతకోసం ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కే ప్రశాంత్‌పాటిల్ పిలుపునిచ్చారు. పట్టణంలో జాతీయ పండుగల ఆచరణ సమితి, విశ్వకర్మ సంఘం సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటైన విశ్వకర్మ జయంతిలో పాల్గొని మాట్లాడారు. విశ్వకర్మ యోజనె ద్వారా చేతివృత్తులవారికి స్వయం ఉపాధి కింద తక్కువ వడ్డీతో రుణాలు ఇస్తున్నారని అర్హత, ఆసక్తికల్గినవారు సద్వినియోగం చేసుకో వాలన్నారు. దైవశక్తి కల్గిన విశ్వకర్మలు దేవతలకు స్వర్గాన్ని కట్టారన్నారు. ఈ సముదాయానికి ఎంతో నైపుణ్యం ఉందన్నారు. నేకార, అక్కసాలిగ, కమ్మార, బడగి, శిల్ప రచనాకార, చమ్మార, మేస్త్రి, బుట్టి, బొమ్మల తయారీ, దోబి, క్షౌరిక తదితర 18 సామాజిక వర్గాల వారికి విశ్వకర్మ యోజనెకింద రుణాలు ఇస్తున్నా రన్నారు. ఈ సందర్భంగా తాలూకా ఆరోగ్య అధికారి డాక్టర్ సత్య నారాయణ రెడ్డి, పురసభ ముఖ్య అధికారి రుద్రమ్మ, శరణయ్య, పట్టుశాఖ డైరెక్టర్ చిన్న కైవారమయ్య, అక్షర దాసోహ డైరెక్టర్ నరసింహరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శాంతిధామలో బాబా క్యాలెండర్ ఆవిష్కరణ

బొమ్మనహళ్ళి, జనవరి 1: అరికెరె శాంతినికేతన్ లే అవుట్‌లో వెలసిన శాంతిధామలో నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. షిర్డీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఆలయ కమిటీ సభ్యులు బాబా క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. దాత రమ్య ప్రింటర్స్ అధినేత రామిరెడ్డి, పార్వతమ్మ దంపతులను, కుమారుడు నరేంద్రను ఆత్మీయంగా సత్కరించారు. షిర్డీసాయిబాబా చిత్రపటం ఉన్న నాణ్యతతో కూడిన క్యాలెండర్‌ను ప్రతి ఏటా భక్తులకు ఉచితంగా ఇస్తున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు మేడా రామకృష్ణ తెలిపారు. ఆలయంలో మంజునాథస్వామి, సంతోషిమాతా ఆలయాలు ఉన్నాయని, త్వరలోనే వెంకటేశ్వర స్వామి ఆలయం తలెత్తనుందన్నారు. దాత కుటుంబీకులను ఆలయ జ్ఞాపికతో ఆత్మీయంగా సత్కరించారు. నూతన సంవత్సరం ప్రారంభం కావడంతో ఆలయ శుద్ధి, అనంతరం భక్తులచే బాబాకు అభిషేకం, అనంతరం అలంకరణ నిర్వహించారు. మంజునాథస్వామి ఆలయంలోనూ, సంతోషిమాతా ఆలయంలోనూ భక్తుల సందడి నెలకొంది. కార్యక్రమానికి క్యాండోర్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన దివంగత నాగభూషణం కుటుంబానికి చెందిన దాతలు కాంతమ్మ, నరేశ్‌లు పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న దాతలను ఆత్మీయంగా సత్కరించారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు, క్యాలెండర్ కూడా ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు తాతయ్యగుప్త, మనోహర్ గుప్త, కృష్ణయ్యశెట్టి, టీజీవీ గుప్త, సత్యనారాయణ, సేవాదళ్ సభ్యులు, వలంటీర్లు పాల్గొన్నారు. కాగా నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆలయ ట్రస్టు సామాజిక సేవలో భాగంగా వృద్ధులు, పేదలు, పౌరకార్మికులు తదితరులకు సుమారు 600మందికి దుప్పట్లు పంపిణీ చేశారు.



షిర్డీసాయిబాబా ఆలయంలో క్యాలెండర్ విడుదలలో ప్రముఖులు

296 మందికి కోవిడ్ పాజిటివ్

బెంగళూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కోవిడ్ కేసులు పెరుగుతున్నాయి. సోమవారం 296మందికి పాజిటివ్ నిర్ధారణ అయ్యింది. 50మంది డిశ్చార్జ్ కాగా ఒకరు మృతి చెందారు. 1245 మంది చికిత్సలు పొందుతున్నారు. బెంగళూరులో 131మందికి మైసూరులో 29మంది, హాసన్‌లో 17, తుమకూరులో 16, దక్షిణకన్నడలో 13, బళ్ళారిలో 11మందికి ప్రబలగా మిగిలిన జిల్లాల్లో పదిలోపు కేసులు నమోదయ్యాయి. పాజిటివ్‌శాతం 5.89గా నమోదైంది.

కువెంపు జయంతిపై నిర్లక్ష్యం తగదు

శిడ్లఘట్ట, జనవరి 1: విశ్వమానవగా పేరొందిన ప్రముఖ కన్నడ సాహితీవేత్త కువెంపు జయంతిని ఆచరించేందుకు నిర్లక్ష్యం చూపిన అధికారులు, పీడీఓలపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని మానవ హక్కులు సంఘం సంస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. తాలూకా పంచాయతీలో ఈఓకు వినతిపత్రం సమర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాటాడారు. కన్నడ సాహిత్యంలో కువెంపు మేరు పర్వతంలాంటివారన్నారు. విశ్వమానవ సందేశాన్ని అందించిన మహనీయుడన్నారు. కువెంపు జయంతిని విశ్వ మానవతా దినోత్సవంగా ఆచరించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. అయితే కొన్ని గ్రామాల్లో మాత్రమే ఆచరించారన్నారు. ప్రభుత్వ ఆదేశాలను పాటించకపోవడం సరికాదన్నారు. నిర్లక్ష్యం వహించినవారిపై చర్యలు తీసుకోవాలని లేదా తాలూకా పంచాయతీ కార్యాలయం వద్ద భారీ నిరసన చేపడతామన్నారు. ఈ సందర్భంగా అశోక్, మంజునాథ్, నవీన్‌కుమార్, ఎస్ఎం రమేశ్, మంజునాథ, కదిరప్ప తదితరులు పాల్గొన్నారు.

స్వాభిమాని పార్క్‌లో న్యూఇయర్ సంబరాలు

బొమ్మనహళ్ళి, జనవరి 1: హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లోని స్వాభిమాని పార్క్‌లో నూతన సంవత్సర వేడుకలు ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఉత్సాహంగా సాగాయి. డ్యాన్సులు, ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు సాగాయి. మాజీ ఎంపీ, కాంగ్రెస్ నాయకుడు ఉగ్రప్ప నేతృత్వంలో కార్యక్రమాలు జరిగాయి. కేక్ కట్ చేసి పిల్లలందరికీ పంపిణీ చేశారు. స్థానికులు నూతన సంవత్సర వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కేపీసీసీ సభ్యుడు వాసుదేవ రెడ్డి, హెచ్ఎస్ఆర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాసుదేవరెడ్డి, అనిల్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.



కళాబృందంతో మాజీ ఎంపీ ఉగ్రప్ప తదితరులు

కొత్త ఏడాదిలో ప్రయాణికులకు పెద్దపీట

- కేఎస్ఆర్టీసీ ఎండీ అన్బు కుమార్

బెంగళూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (కేఎస్ఆర్టీసీ) 2024 సంవత్సరానికి ప్రయాణీకుల సంవత్సరంగా ప్రక టించింది. ఈ విషయాన్ని కేఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ అన్బుకుమార్ నగరంలో సోమవారం మీడి యాతో మాట్లాడారు. గత ఏడాది కార్మిక సంవ త్సరంగా ప్రకటించి ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల సంక్షేమానికి అనేక అరుదైన పథ కాలను అమలులోకి తెచ్చామన్నారు. ఇందులో భాగంగానే ప్రమాదాల్లో మృతి చెందే సిబ్బందికి గతంలో ఇస్తూ వచ్చిన రూ.10లక్షల పరిహారాన్ని ఏకంగా రూ.కోటికి పెంచామన్నారు. ఇందుకుగాను బీమా సంస్థలతోనూ, బ్యాంకులతోనూ ఒప్పందాలు కుదుర్చుకున్నామన్నారు. అలాగే ప్రయాణీకులు మృతి చెందితే ఇస్తున్న పరిహార మొత్తాన్ని రూ.3లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచామన్నారు. శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తున్న కారణంగా ఆర్టీసీ ఆదాయం కొంత మేరకు తగ్గినమాట నిజమేనన్నారు. ఈ ఆదాయాన్ని కార్గో, ఇతర వాణిజ్య సేవల ద్వారా భర్తీ చేసుకోవాలన్నది సంకల్పమన్నారు. ఈ దిశలో 500 కార్గో బస్సు లను రాష్ట్రమంతటా అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ఈ సేవలు గరిష్ఠంగా వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. శక్తి పథకం కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటక, దేవదాయ శాఖల ఆదాయం గణనీయంగా పెరిగిందన్నారు.

ప్రభుత్వం ఆధ్వర్యంలో లిక్కర్ అవుట్‌లెట్లు

- బసవేశ్వరనగర్‌లో తొలిశాఖకు శ్రీకారం

బెంగళూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కొత్తసంవత్సర వేడుకల ఆరంభం రోజునే అబ్కారీశాఖ సరికొత్త విధమైన వ్యాపారాలకు తెరలేపింది. ప్రభుత్వం ద్వారానే లిక్కర్ లే అవుట్‌లను ఆరంభించాలనే ప్రతిపాదనకు శ్రీకారం చుట్టారు. బెంగళూరు బసవేశ్వరనగర్ తిమ్మయ్య రోడ్డులో సోమవారం లిక్కర్ అవుట్ లెట్‌ను మైసూరు సేల్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ (ఎంఎస్ఐఎల్) ఎండీ మనోజ్‌కుమార్ ఆరంభించారు. రాష్ట్రంలో మద్యం వ్యాపారాలను ఎంఎస్ఐఎల్‌తో పాటు ప్రైవేటు వ్యక్తు లకు లైసెన్సుల ద్వారా సాగుతున్నాయి. తొలిసారిగా అబ్కారీశాఖ ద్వారా తొలి అవుట్ లెట్‌ను ఆరంభించారు. ఎంఎస్ఐఎల్ మేనేజింగ్ డైరెక్టర్ మనోజ్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ మధ్యతరగతి ప్రజలతో పాటు సమాజంలో అన్ని వర్గాల వినియోగదారులకు మద్యం అందుబాటులో ఉండాలని శాఖ ద్వారానే అవుట్‌లెట్‌ను ఆరంభించామన్నారు. సాధారణ లిక్కర్ నుంచి విలువైన మద్యం బ్రాండ్‌ల దాకా ఉంటాయన్నారు. అంతర్జాతీయ స్థాయి దుకాణాల తరహాలో అవుట్‌లెట్‌లు ఉంటాయన్నారు. ఎంఎస్ఐఎల్ ఛైర్మన్, పరిశ్రమల శాఖా మంత్రి ఎంబీ పాటిల్ సూచనల మేరకు ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంఎస్ఐఎల్‌ల లిక్కర్‌షాప్‌లు 1029లు ఉన్నాయని వీటిలో 200ల దుకాణాలను ప్రత్యేక లే అవుట్‌లుగా మారుస్తామన్నారు. విజయనగర్, డాక్టర్ రాజ్‌కుమార్ రోడ్, ఆర్‌పీసీ లేఅవుట్‌లలో త్వరలోనే లేఅవుట్‌లు ఆరంభిస్తామన్నారు. రీటైల్‌గాను విక్రయాలు ఉంటాయన్నారు. రాష్ట్రంలోని అన్ని మహానగర పాలికెల పరిధిలో రెండేసి చొప్పున అవుట్ లెట్‌లు తెరుస్తామన్నారు. నాలుగు నెలల వ్యవధిలో 200 అవుట్‌లెట్‌లు అందుబాటులోకి తెస్తామన్నారు. తద్వారా 30-40శాతం వ్యాపారాలు పెరగవచ్చునని భావిస్తున్నామని నాలుగువేల కోట్లు అత్యధిక వ్యాపారాలు చేయదలచామన్నారు. వివిధ రాష్ట్రాలలో శాఖ ద్వారానే అవుట్‌లెట్‌లు ఉన్నాయని అదే విధానం రాష్ట్రంలోను తీసుకువస్తున్నామన్నారు. ఎంఎస్ఐఎల్ డైరెక్టర్ ఎఎం చంద్రప్ప, అధికారులు రవికుమార్, బసవరాజ్, చంద్రశేఖర్, అవినాశ్ తదితరులు ఉన్నారు.

శిల్పి అరుణ్ యోగిరాజ్‌కు ప్రశంసలు

- కర్ణాటకకు గర్వకారణం - విజయేంద్ర

బెంగళూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో బాలరామ విగ్రహ ప్రతిష్ఠాపనకు రోజులు సమీపిస్తున్నాయి. మైసూరుకు చెందిన శిల్పి అరుణ్ యోగిరాజ్ చెక్కిన మూర్తి అయోధ్యలో ప్రతిష్ఠాపన కావడం కర్ణాటకకు గర్వకారణమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర సంతోషం వ్యక్తం చేశారు. శిల్పి అరుణ్ యోగిరాజ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. సోమవారం బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ అరుణ్ యోగిరాజ్ రూపొందించిన రామ్‌లల్లా మూర్తి ప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు కావడం రామభక్తులకు సంతోషించే విషయమన్నారు. కర్ణాటకకు రాముడికి సంబంధం ఉందని, చారిత్రాత్మకమైన అయోధ్యలో ప్రతిష్ఠించే విగ్రహం మైసూరు శిల్పి చెక్కినది కావడం, హనుమంతుడు కర్ణాటకలోనే జన్మించడం వంటివి ఇక్కడి భక్తులకు సంతోషం కలిగించే అంశమన్నారు.

విద్యాదానం చాలా గొప్పది



కేక్ తినిపిస్తున్న మాజీ ఐపీఎస్ అధికారి

బెంగళూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): దానాలన్నింటిలో కల్లా విద్యాదానం చాలా గొప్పదని మాజీ ఐజీపీ బీఎన్ఎస్ రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఇందిరా నగర్‌లో సోమవారం ఆయన నూతన సంవత్సర వేడుకలను రాకుం అంధుల పాఠశాలలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ఐపీఎస్ అధికారిగా రాష్ట్రంలో తాను చేసిన సేవలు ఎంతో సంతృప్తినిచ్చాయన్నారు. మనుష్య జాతి నేను నాది అనే అహంకారం విడనాడాలని విశాల మనోభావాలను అలవర్చుకోవాలని ఆయన హితవు పలికారు. మనిషిలో నానాటికి పెరిగిపోతున్న దురాశే అశాంతికి మూల కారణమన్నారు. ఉత్తమ సమా జ నిర్మాణం కోసం ప్రజలంతా కలిసి మెలిసి జీవించాలన్నారు. విశ్వ లాన్ టెన్నిస్ క్రీడల్లో ఏడు సార్లు అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించి దేశానికి కీర్తిప్రతిష్ఠలు సంపాదించి పెట్టానని రెడ్డి పేర్కొన్నారు. ఆచార్య రాకుం గురూజీ మాట్లాడుతూ సురక్షిత సమాజ నిర్మాణంలో బిఎన్ఎస్ రెడ్డి గణనీయ కృషి చేశారని కొనియాడారు. ఇదే కార్యక్రమంలో బిఎన్ఎస్ రెడ్డి తన పుట్టిన రోజు వేడుకను అంధ విద్యార్థులతో కలిసి జరుపుకున్నారు. కార్యక్రమంలో డా.కవితా రెడ్డి, ఇంటెక్ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీవెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

30 ఏళ్లకిందటి కేసుల్లో అరెస్టులా..

- మండిపడ్డ ప్రతిపక్షనేత అశోక్


బెంగళూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రామజన్మభూమి కోసం పోరాటం చేసిన వారిని కాంగ్రెస్ ప్రభుత్వం వెతికి మరీ అరెస్టులు చేస్తోందని ప్రతిపక్షనేత ఆర్ అశోక్ మండిపడ్డారు. విధానసౌధలో సోమవారం మీడియాతో మాట్లాడుతూ హుబ్బళ్ళిలో 30ఏళ్లక్రిందట రామజన్మభూమి పోరాటంలో పాల్గొన్న వారిని అరెస్టు చేయడం దారుణమన్నారు. సీఎం సిద్దరామయ్య తీరు మార్చుకోకుంటే తగిన పరిణామాలు తప్పవన్నారు. రామజన్మభూమి పోరాటంలో నేనూ పాల్గొన్నానని అరెస్టు చేస్తారా..? అంటూ సవాల్ విసిరారు. సిద్దరామయ్య టిప్పుజయంతి చేస్తారని కానీ రాముడిని పూజించరన్నారు. కాషాయం చూస్తే సీఎం భరించలేరన్నారు. ఓట్లకోసం మతాల మధ్య చిచ్చు పెడుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో వీరశైవ లింగాయతులను విడగొట్టే కుట్ర పన్నారన్నారు. రాష్ట్రాన్ని అరాచకం చేసేలా యత్నించిన వారిపై కేసులను రద్దు చేశారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి లేదని కాంగ్రెస్ ఎమ్మెల్యేలే విమర్శిస్తున్నారన్నారు. నియోజకవర్గాలకు వెళితే ప్రజలనుంచి దూషణలు తప్పవని ఇలాంటి భిన్నమైన అంశాలను తెరపైకి తెస్తున్నారన్నారు. మంత్రి పదవులను రాలేదని సలహాదారుల ముసుగులో కేబినెట్ హోదాలతో సంతృప్తి పరిచారన్నారు.

సిద్దరామయ్యలోనే రాముడు ఉన్నాడు

- మాజీ మంత్రి ఆంజనేయ వివాదాస్పద వ్యాఖ్యలు

బెంగళూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామమందిర ఆరంభానికి సీఎం సిద్దరామయ్యకు ఆహ్వానం లేకపోవడంపై మాజీ మంత్రి హెచ్ ఆంజనేయ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. సోమవారం చిత్రదుర్గలో మీడియాతో మాట్లాడుతూ అయోధ్యకే వెళ్లి రాముడి పూజలు చేయాలా..? సీఎం సొంతూరు సిద్దరామనహుండిలో రాముడి గుడి ఉందని అక్కడే పూజలు చేస్తామన్నారు. అయోధ్యలో ఉండేది బీజేపీ రాముడన్నారు. సిద్దరామయ్యకు ఆహ్వానం అందకపోవడమే మంచిదైందన్నారు. సిద్దరామయ్యలోనే రాముడు ఉన్నాడన్నారు. బీజేపీ వారిని అయోధ్యకు పిలిపించుకుని భజన చేస్తున్నారన్నారు. నేనూ ఆంజనేయుడేనని, శ్రీరామభక్తుడే అన్నారు. రాముడు, ఆంజనేయుడు మా వర్గానికి చెందినవారిని బీజేపీ వారిది మతాలమధ్య చిచ్చుపెట్టే విధానమన్నారు. రామమందిర నిర్మాణం చాలా..? ఇల్లులేని పేదలకు శాశ్వత గూడు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



బెంగళూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మల్లేశ్వరం చౌడయ్యహాల్‌లో రాజరాజేశ్వరి కళానికేతన్ ఆధ్వర్యంలో విదూషి డాక్టర్ వీణా మూర్తివిజయ్ నేతృత్వంలో సంప్రదాయ దేవాలయ నృత్య 'నవసంధి' కార్యక్రమం సభికు లను అలంరించింది. 15వ శతాబ్దంనాటి అష్టదిక్పాలక పూజ అనే ధార్మిక నృత్యాన్ని నవసంధి పేరిట డాక్టర్ సంగీతా ఫణిష్ చేసిన నాట్యం మంత్రముగ్ధులను చేసింది.